క్లుప్తంగా

కాలభైరవునికి పూజలు



కడప కల్చరల్ : కడప శివార్లలోని శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి ఆలయంలో సోమవారం అమావాస్య పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీధర్‌స్వామి పర్యవేక్షణలో ఉదయం ప్రాతఃకాల పూజలు, మూల విరాట్‌కు విశేష అభిషేకాలు చేశారు. మొక్కులుగల 50 జంటలు విచ్చేసి ఆలయ ప్రాంగణంలో స్వామికి సమర్పించిన గుమ్మడికాయలపై దీపాలు వెలిగించి హారతులు సమర్పించారు. సామూహిక కుంకుమార్చన, సహస్ర నామార్చన చేశారు. ఆలయ నిర్వాహకులు మేరువ బాలాజీరావు పర్యవేక్షణలో తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆర్థిక సాయం

కడప కార్పొరేషన్: ప్రొద్దుటూరు పట్టణంలో కూలి పని చేస్తూ ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తు నుంచి కిందపడి తీవ్ర గాయాలపాలైన యువకుడు జంపు సాయిక్రిష్ణకు వైఎస్సార్‌సీపీ యువజన జిల్లా కార్యదర్శి, బేడ, బుడగజంగం హక్కుల పోరాట సమితి నాయకులు పస్తం అంజి ఆర్థిక సాయం చేశారు. సోమవారం ప్రొద్దుటూరులోని వారి స్వగృహానికి వెళ్లి వెన్నెముక విరిగి, నడవలేని స్థితిలో ఉన్న ఆ యువకుడికి రూ.15 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, రాముడు, చిన్న వెంకటయ్య, జమ్మయ్య, వెంకటయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ టెండర్లను మళ్లీ పిలవాలి

కడప కార్పొరేషన్: కడప మున్సిపల్ మైదానంలో నిర్వహించే ఎగ్జిబిషన్ టెండర్లను మళ్లీ పిలవాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా, కార్యవర్గ సభ్యులు మునెయ్య, లింగన్న, మైనుద్దీన్ కోరారు. సోమవారం వారు కమిషనర్ ప్రవీణ్‌చంద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఆదాయానికి గండి కొట్టి కొందరు దొడ్డిదారిన ఎగ్జిబిషన్ పనులు చేస్తున్నారన్నారు. టెండర్ అగ్రిమెంట్ ఇవ్వలేదని అధికారులు చెబుతుంటే, మున్సిపల్ మైదానంలో పనులు మాత్రం చకచకా జరిగిపోతున్నాయన్నారు. వెంటనే ఎగ్జిబిషన్ టెండర్లను రద్దు చేసి కార్పొరేషన్‌కు ఆదాయం సమకూరేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

గిరి ప్రదక్షిణ ఆటంకాలను తొలగించండి

కడప కల్చరల్ : పుష్పగిరి క్షేత్రంలో గిరి ప్రదక్షిణకు పలువురు ఆటంకం కలిగిస్తున్నారని, వీటిని తొలగించి ప్రదక్షిణ సజావుగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలని భక్తులు సోమవారం స్పందన కార్యక్రమంలో అధికారులకు విన్నవించారు. తాము నాలుగు మాసాలుగా పుష్పగిరిలో గిరి ప్రదక్షిణ సంప్రదాయాన్ని పునరుద్ధరించి అక్కడి పీఠాధిపతి అనుమతితో గిరి ప్రదక్షిణలు చేస్తున్నామని వారు జేసీ గణేష్ కుమార్‌కు విన్నవించారు. గిరి ప్రదక్షిణ ఎన్నో ఏళ్లుగా జరుగుతోందని, అప్పుడు కొండ చుట్టూ దారికి ఎలాంటి ఆటంకాలు లేవని, ఇటీవలి కాలంలో దారిని ఆక్రమించడంతో ఈ చిక్కులు వస్తున్నాయని విన్నవించారు.

పని చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: టెండర్ వేసి పని చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య పేర్కొన్నారు. సోమవారం 48వ డివిజన్‌లో టెండర్ వేసి పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని కోరుతూ స్పందనలో నగర పాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 48వ డివిజన్ హోమియోపతి కళాశాల రోడ్డుకు కొన్ని రోజులుగా టెండర్ వేసి పనులు చేయకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు.

వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైవీయూ : ర్యాగింగ్ రహిత విద్యాలయంగా యోగివేమన విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి పనిచేయాలని వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి సూచించారు. సోమవారం వైవీయూలో యాంటీ ర్యాగింగ్‌పై ఎన్ఎస్ఎస్ యూనిట్–7 ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ర్యాగింగ్ చేయడం ద్వారా ఉజ్వల భవిష్యత్తుకు ఆటంకం కలుగుతుందన్నారు. ప్రశాంత వాతావరణంలో, సోదరభావంతో విద్యాభ్యాసం పూర్తి చేయాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటరామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

– డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



26వ డివిజన్‌లో నిర్వహించిన 'జగనన్న సురక్ష'లో సర్టిఫికెట్లు అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: దళారుల ప్రమేయం లేకుండా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక 26, 39 డివిజన్లలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల్లో ఆయన పాల్గొని, సర్వీస్ రిక్వెస్ట్ స్పాట్ రిజిస్ట్రేషన్, దరఖాస్తుల పరిశీలన కౌంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పాలనలో పింఛన్, రేషన్ కార్డు ఏది కావాలన్నా జన్మభూమి కమిటీల సంతకాలు పెట్టించుకొని రమ్మనేవారని, వారు ఎంతో కొంత ముట్టచెబితే తప్పా సంతకం పెట్టేవారు కాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎవరి సంతకాలతో అవసరం లేకుండా అర్హులై ఉంటే చాలు ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు 99 శాతం ప్రజలకు చేరువ అయ్యాయన్నారు. మిగిలిన ఒక్క శాతంలో ఎవరైనా అర్హులు ఉంటే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వారికి మేలు చేకూరుస్తున్నామన్నారు. సేవా దృక్పథంతో పనిచేస్తున్న వాలంటీర్లపై పవన్ కళ్యాణ్ విమర్శలు చేయడం దారుణమన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థపై ఆరోపణలు చేస్తున్న వారికి గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సచివాలయాల పరిధిలో వలంటీర్లు సర్వే చేసి ప్రజలకు అవసరమైన సేవలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారన్నారు. వాటిని జగనన్న సురక్ష శిబిరాల్లో పరిష్కరిస్తున్నారన్నారు. కుల, ఆదాయ, కుటుంబ సభ్యుల, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు తదితరాలకు సంబంధించి 11 రకాల సేవలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్‌బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, 26, 39 డివిజన్ల ఇన్‌చార్జులు త్యాగరాజు, కమాల్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్య, షఫీ, మియ్యా, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'స్పందన' సమస్యల పరిష్కారానికి కృషి



నగర వన పరిశీలనలో భాగంగా అటవీ శాఖ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్‌లోని వీసీ హాలులో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో మొత్తం 60 అర్జీలు రాగా, ఇంజినీరింగ్ విభాగం–19, టౌన్‌ప్లానింగ్–21, రెవెన్యూ విభాగం–7, హెల్త్ విభాగం–2, యూపీఏ విభాగం–6, హార్టికల్చర్ విభాగం–1, కడప తహసీల్దార్–2, సీకే దిన్నె తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించి–1 అర్జీ వచ్చింది. వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి గడువులోపు వాటిని పరిష్కరించాలని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, మేనేజర్ హిదాయతుల్లా పాల్గొన్నారు.

నగర వనంలో పార్కింగ్ సదుపాయం కల్పించాలి

నగర వనానికి వచ్చే ప్రజలకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ చంద్ ఆదేశించారు. సోమవారం ఆయన నగర వనాన్ని పరిశీలించారు. నగర వనం ఎంట్రెన్స్‌లో ప్లాజా ఏర్పాటు చేయాలన్నారు. నగర వనాన్ని పూర్తిగా సర్వే చేసి ఆహ్లాదకరమైన ప్రాంతాలను తయారు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. హార్స్ రైడింగ్ జోన్‌లో పొదలను తొలగించాలని తెలిపారు. అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌ది అవగాహనా రాహిత్యం

కడప కార్పొరేషన్: రాజకీయ అవగాహనా రాహిత్యంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రచారం కోసం ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. సోమవారం మారుతీనగర్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పవన్‌కు రాష్ట్రంలో అభ్యర్థులే లేరని, ఆయన ఎక్కడ పోటీ చేస్తారో కూడా ఇంతవరకూ స్పష్టత లేదన్నారు. జనసేన పార్టీకి జిల్లాల్లో అధ్యక్షులే లేరని.. 175 స్థానాల్లో పోటీ చేసే సత్తా పవన్‌కు ఉందా అని ప్రశ్నించారు. ఏ పార్టీతో పొత్తు పెట్టుకోకుండా పోటీ చేసే దమ్ము, ధైర్యం పవన్‌కు లేదన్నారు. బాబు రాసిచ్చిన స్క్రిప్టును చదువుతున్న పవన్‌ను జనం నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ప్యాకేజీ కోసమే ఆయన బయటికి వస్తారని, లేకపోతే సినిమాల్లో బిజీగా ఉంటారన్నారు. వలంటీర్లపై ఆయన చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. 2019లో పవన్‌ను రెండుచోట్ల ఓడించినా బుద్ధిరాలేదన్నారు. 2024 ఎన్నికల తర్వాత టీడీపీ, జనసేన అడ్రస్ లేకుండా పోతాయన్నారు.

చట్టాలను అతిక్రమిస్తే చర్యలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు సోమవారం పోలీసులు జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా వాహనాలను తనిఖీ చేయడంతోపాటు పలు ప్రాంతాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారికి తగిన సూచనలు చేశారు. చట్టాలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేసు నమోదు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగస్వామి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు కడప నగరంలోని ఎర్రముక్కపల్లిలోని పూసలవీధికి చెందిన శిరీష, రవిలకు 2020లో వివాహమైంది. కొంతకాలం పాటు వారు అన్యోన్యంగా ఉన్నారు. ఇటీవల కాలం నుంచి భర్త రవి, అత్త, ఆడబిడ్డలు అధిక కట్నం కోసం శిరీషాను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. వేధింపులు భరించలేక ఆమె పోలీసులను ఆశ్రయించింది. శిరీషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్తతో పాటు అత్త, ఆడబిడ్డపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రిటైర్డ్ డీఈ ఇంట్లో చోరీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం మృత్యుంజయ కుంట శివాలయం ఎదురుగా ఉన్న రిటైర్డ్ డీఈ ఇంట్లో దొంగలు పడ్డారు. ఇంట్లో ఉన్న రూ.2 లక్షల విలువ చేసే వెండి వస్తువులను అపహరించారు. చిన్నచౌక్ పోలీసుల వివరాల మేరకు.. గోపాల్‌రెడ్డి డీఈగా పని చేస్తూ పదవీ విరమణ పొందారు. హైదరాబాదులోని బంధువుల ఇంటికి కుటుంబ సభ్యులతో కలసి ఈ నెల 5వ తేదీ వెళ్లారు. తిరిగి ఆదివారం కడపకు వచ్చారు. అపార్ట్‌మెంట్‌లో ఆయన నివాసముంటున్న ఇంటి తాళాలు పగిలిపోయి ఉండడంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూశాడు. ఇంట్లో ఉన్న రెండు లక్షల విలువ చేసే వెండి సామానులను దొంగలు అపహరించినట్లు గుర్తించారు. దీంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థికసాయం అందజేస్తున్న రాచమల్లు రవిశంకర్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : ఖాజీపేట మండలం తుడుములదిన్నెలో ఆత్మహత్య చేసుకున్న రైతు వెంకట సుబ్బారెడ్డి కుటుంబానికి వైఎస్సార్ సీపీ నేత రాచమల్లు రవిశంకర్‌రెడ్డి రూ. 50 వేల ఆర్థిక సహాయం అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. రైతు వెంకటసుబ్బారెడ్డి భూ సమస్యపై రెవెన్యూ అధికారులతో చర్చించానని త్వరలోనే వారి భూమికి పట్టా అందిస్తామని రెవిన్యూ అధికారులు తెలిపినట్లు ఆయన కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కడప రూరల్: భూ ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బద్వేలు మండలం చెన్నంపల్లెకు చెందిన సరస్వతి కోరారు. సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తమ గ్రామ పొలంలో తనకు 1.30 ఎకరాల పొలం ఉందన్నారు. ఈ భూమిని కొంతమంది ఆక్రమించారని ఆరోపించారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. తనకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన పదోన్నతులలో పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులంతా విధులను సమర్థవంతంగా నిర్వహించాలని రూట వ్యవస్థాపకులు హిదయతుల్లా కోరారు. ఇందులో భాగంగా ఇటీవల పదోన్నతులను పొందిన ఎంఈఓ–2 ఇర్షాద్ అహ్మద్, హెచ్ఎంగా సయ్యద్ ఇక్బాల్, అబుల్ వఫా, మస్తాన్‌వల్లి, షాహిదుల్లాలను రూట ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రూట రాష్ట్ర నాయకులు డాక్టర్ వసీవుల్లా సాహేబ్, సత్తార్‌ఫైజీ, మహమ్మద్ అయ్యూబ్, షహాబుద్దీన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇర్షాద్, జాకీర్ హుస్సేన్, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇలియాస్‌బాష పాల్గొన్నారు.

'మాస్టర్ లా'లో గౌతమి సంఘమిత్రకు గోల్డ్ మెడల్



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరానికి చెందిన గౌతమి సంఘమిత్రకు మాస్టర్ ఆఫ్ లాలో గోల్డ్ మెడల్ దక్కింది. కడపకు చెందిన గౌతమి సంఘమిత్ర శ్రీకృష్ణ దేవరాయ యూనివర్శిటీలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. ఎస్కేయూలో మాత్రమే అందిస్తున్న క్రిమినల్ లాలో ఆమె గోల్డ్ మెడల్ సాధించారు. సోమవారం అనంతపురం శ్రీకృష్ణ దేవరాయ యూనివర్శిటీలో జరిగిన కాన్వొకేషన్‌లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. సంఘమిత్ర తండ్రి సంపత్‌కుమార్ కడప నగరంలో ప్రముఖ న్యాయవాదిగా 35 సంవత్సరాలు పనిచేయడమే కాకుండా పలు సేవలు అందిస్తున్నారు. ఆమె తల్లి మనోరమ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ భూములకు పట్టాలివ్వాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలో దళితులకు ఇచ్చిన వ్యవసాయ భూములకు పట్టాలు మంజూరు చేసి సర్వహక్కులు కల్పించాలని ఏపీ దళితమిత్ర సంఘం అధ్యక్షులు కె.రామాంజనేయులు ప్రభుత్వానికి విన్నవించారు. సోమవారం కడప నగరంలోని తమ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్ల కిందట ఎస్సీ కార్పొరేషన్ భూములు ఇచ్చారని, అయితే వాటిని అనుభవించేందుకు మాత్రమే అవకాశం కల్పించారన్నారు. అలా కాకుండా పట్టాలు మంజూరు చేసి రిజిస్ట్రేషన్లకు సైతం అవకాశం కల్పించాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ భూములు అన్యాక్రాంతం నుంచి విడిపించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఎస్సీ అట్రాసిటీ చట్టాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి దళితులపై దాడులు, అత్యాచారాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థి సంఘాల సమావేశం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రజాస్వామ్య హక్కులను జిల్లా విద్యాశాఖాధికారి కాలరాయడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం డీఈఓ రాఘవ రెడ్డి జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ నగరంలోని సీపీఎం కార్యాలయంలో వివిధ విద్యా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనకూడదని, అలా పాల్గొంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని డీఈఓ రాఘవ రెడ్డి ఉత్తర్వులు జారీ చేయడం ఆయన నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు బాబు నాగేంద్ర, వీరణాల శివకుమార్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు షాక్‌తో వ్యక్తి మృతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన విశ్వాస్(33) సోమవారం రాత్రి కరెంటు వైరు తగిలి మృతి చెందినట్లు వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు. విశ్వాస్ ఎస్పీ బంగళా సమీపంలో ఓ టిఫిన్ మొబైల్ వ్యానులో వంట మాస్టర్‌గా పని చేస్తున్నాడన్నారు. దోసె వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగలడంతో అక్కడికక్కడే పడి మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేడు రైతు బజార్‌కు సబ్సిడీ టమాటాలు రాక

కడప అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో మంజూరు చేస్తున్న టమాటాలు మంగళవారం రెండు టన్నులు కడప రైతు బజార్‌కు వస్తున్నట్లు రైతు బజార్ మేనేజర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత టమాటాలను ఉదయం 6.30 గంటల నుంచి పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఒకొక్కరికి కిలో చొప్పున మాత్రమే అందచేస్తామని తెలిపారు. వినియోగదారులు తప్పని సరిగా ఆధార్‌కార్డు వెంట తీసుకుని రావాలని తెలిపారు. కిలో 50 రూపాయల చొప్పున అందచేస్తామన్నారు.

న్యాయం చేయండి

కడప రూరల్: తమ ఆస్తిని అయినవారే కాజేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతున్నారని ప్రొద్దుటూరుకు చెందిన శ్రీదేవి ఆరోపించారు. సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆమె మాట్లాడుతూ పెద్ద సుబ్బన్న, లక్షుమ్మ మా తల్లిదండ్రులు అని తెలిపారు. మా తల్లిదండ్రులకు నాతో కలిపి ముగ్గురు సోదరులు, ఇద్దరు అక్కచెల్లెళ్లు ఉన్నారని అన్నారు. తమకు అందరికీ వివాహాలు జరిగాయన్నారు. కాగా మా నాన్న చాలా రోజుల క్రితమే మరణించడంతో ప్రొద్దుటూరు, మైదుకూరులో ఉన్న ఆస్తులన్నీ తమ అమ్మ పేరు మీదనే ఉన్నాయని అన్నారు. ఆస్తిలో కొంత భాగం అక్కచెల్లెళ్లకు రావాల్సివుందన్నారు. అయితే అయిన వారే దొంగగా తమ అమ్మకు మాయ మాటలు చెప్పి ఆస్తిని రాపించుకున్నారని ఆరోపించారు. దీనిపై ప్రశ్నించినందుకు తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆమె భర్త బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవకు సలాం



కరోనా మృతుల అంత్యక్రియలలో..



పాపులమ్మ మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళుతున్న వలంటీర్ నాయక్ (ఫైల్)

కరోనా సమయంలో కొందరికి అందరూ ఉన్నా ఒంటరిగా ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. చిన్నపాటి అనారోగ్యం సోకినా సరే కరోనానేమోనని ఎవరు కూడా దగ్గరకు పోయావారే కాదు. వారి బాగోగులను కూడా పట్టించుకునే వారు కాదు. అలాంటి సమయంలో వాలంటర్లు మేమున్నామంటూ ఎన్నో సేవా కార్యక్రమాలను అందించారు. ఇంటింటికి వెళ్లి కనోరా బాధితుల యోగక్షేమాలను తెలుసుకోవడంతోపాటు వారికి కావాల్సిన అన్ని రకాల సేవలను నిస్వార్థంతో అందించారు. ఇక ఎవరైనా కాలం చేస్తే(చనిపోతే) అయిన వారు ఆమడ దూరంలో ఉంటే వాలంటీర్లు చొరవ తీసుకుని అంత్యక్రియలను నిర్వహించారు. ఇందులో భాగంగానే కడప నగరంలోని 18వ వార్డులో ఉండే తారకరామానగర్‌లో ఇలాంటి సంఘటన చోటుచేసుకుంది. కరోనా సమయంలో పాపులమ్మ అనే వృద్ధ మహిళ చనిపోయింది. దీంతో అయినా వాళ్లు ఎవరూ దగ్గరకు రాకపోవడంతో ఆ ప్రాంత వాలంటీరు పూజారి రామలోకం నాయక్ మేము సైతం వారి సహకారంతో పాపులమ్మ మృతదేహానికి అంత్యక్రియలను నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. వాలంటీర్లు ప్రభుత్వ పథకాలనే కాదు ప్రజల బాగోగులతో పాటు చివరకు వారి అంత్యక్రియలను కూడా చేయగలరని తమ సేవాభావాన్ని చాటుకున్నారు. – కడప ఎడ్యుకేషన్

మానవత్వంతో సాయం



ఖాదర్‌బాషకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రావణ్‌కుమార్ (ఫైల్)

కడప నగరం 20వ డివిజన్ సచివాలయం పరిధిలోని ఖాదర్‌బాషను విధి చిన్నచూపు చూసింది. పుట్టుకతో ఆయన మరుగుజ్జు. కరోనా సమయంలో ప్రమాదవశాత్తు కాలు విరిగి ఆస్పత్రిలో చేరారు. మూడు నెలల పాటు ఆస్పత్రిలోనే ఉండాల్సి వచ్చింది. నెలనెల 1వ తేదిన తెల్లవారకముందే చేతికి అందే పింఛన్ ఈ మూడు నెలలపాటు అందదేమోనని ఖాదర్‌బాష ఆందోళనకు గురయ్యాడు. 1వ తేది తెల్లవారుజామునే ఆ వార్డు వలంటీర్ శ్రావణ్‌కుమార్ ఖాదర్‌బాష గురించి తెలుసుకుని నేరుగా ఆస్పత్రికి వెళ్లి వైద్యుల అనుమతితో ఖాదర్‌బాషకు పింఛన్ మొత్తం అందజేశాడు. ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మూడు నెలల పాటు ఒకటో తేది తెల్లవారుజామునే పింఛన్ అందించాడు. విధి చిన్నచూపు చూసినా ప్రభుత్వ బాధ్యతగల వలంటీర్‌గా శ్రావణ్‌కుమార్ ఖాదర్‌బాష గురించి నిరంతరం పర్యవేక్షించారు. ఆయన ఆరోగ్యం కుదుటపడి డిశ్చార్జి అయ్యేంతవరకు క్షేమ సమాచారాలు తెలుసుకుంటూ ఉండేవాడు.

– కడప కల్చరల్

వలంటీర్ సేవలు మరువలేను



విధి నన్ను చిన్నచూపు చూసింది. కానీ ప్రభుత్వం మాత్రం నన్ను మనిషిగా గుర్తించి బాధ్యతగా యదావిధిగా ఒకటో తేది తెల్లవారుజామునే నాకు రావాల్సిన వికలాంగ పింఛన్ అందజేసింది. మావార్డు వలంటీర్ శ్రావణ్‌కుమార్ తెల్లవారకముందే ఆస్పత్రికి వచ్చి నన్ను పరామర్శించి పింఛన్ మొత్తాన్ని అందజేసి నా ఆరోగ్యం త్వరగా కుదుటపడేలా చూడాలని వైద్యులను కోరేవాడు. నేను ఆస్పత్రిలో ఉన్న మూడు నెలలు కూడా ప్రభుత్వ పక్షాన ఆ వలంటీర్ నన్ను ఆదుకున్నాడు.

– ఖాదర్‌బాష

లెసన్‌ప్లాన్‌ను పక్కాగా అమలు చేయాలి



విద్యార్థులతో కూర్చొని పాఠాలను వింటున్న డీఈఓ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు లెసన్‌ప్లాన్‌ను పక్కగా అమలు చేయాలని డీఈఓ రాఘవరెడ్డి సూచించారు. సోమవారం కడప చెమ్ముమియాపేట బాలికల హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి లెసన్‌ప్లాన్‌పై ఆరా తీశారు. ఇందులో ఎవరు నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవన్నారు. అలాగే సిలబస్‌ను కూడా గడువు లోగా పూర్తి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతోపాటు తరగతి గదిలో చూర్చొని ఉపాధ్యాయురాలు బోధించే పాఠాన్ని విన్నారు. ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానెల్‌పై ఉపాధ్యాయురాలిలో ఆరా తీశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చరిత్రపై అవగాహన అవసరం

కడప కల్చరల్: పాఠశాలల్లో హెరిటేజ్ క్లబ్‌ల ఏర్పాటుతో విద్యార్థుల్లో చరిత్ర పట్ల అవగాహన కలుగుతుందని భారత జాతీయ కళా వారసత్వ సంస్కృతి పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా కన్వీనర్ కె.చిన్నపరెడ్డి అన్నారు. ఇటీవల జాతీయ స్థాయిలో ఆయా ప్రాంతాల సంప్రదాయ ఆహారంపై హైస్కూలు విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో భాగంగా కడప నాగరాజుపేట మున్సిపల్ హైస్కూలు విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. పాఠశాలకు చెందిన 10 మంది ప్రతిభ చూపిన విద్యార్థులకు రీజనల్ స్థాయిలో ఇంటాక్ హెరిటేజ్ క్లబ్ సభ్యత్వం, పాస్‌పోర్టులు లభించాయి. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి చిన్నపరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు జిల్లాలోని గండికోటతో పాటు గొప్ప వారసత్వ ప్రదేశాలున్నాయని.. వాటిని ప్రత్యక్షంగా చూసి ఆ ప్రాంతాల గురించి తెలుసుకోవాలన్నారు. హెచ్ఎం ఓ.కవితా సుధా రాణి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, వారసత్వ పుస్తకాలను అందజేశారు. సంస్థ కో కన్వీనర్ సీవీ సుబ్బారెడ్డి, ఇంటాక్ ప్రణాళిక విభాగం కార్యదర్శి గౌరీశంకర్, కొండూరు జనార్దన్‌రాజు, ఆలయాల విభాగం కార్యదర్శి ఎస్.భారవి పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ విడుదల చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం కోచింగ్ సెంటర్‌లలో శిక్షణ తీసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం డీఎస్సీని విడుదల చేయాలని కోరారు.